క్లుప్తంగా

జీజీహెచ్‌లో ఉద్యోగ నియామక ఉత్తర్వులు



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ట్రామా కేర్ సెంటర్‌లో రెండు బయో మెడికల్ టెక్నీషియన్, ఒక డేటా ఎంట్రీ ఉద్యోగానికి కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియామకం ఉత్తర్వులు మంగళవారం ఇచ్చారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామకపు ఉత్తర్వులు అందజేసి ప్రతి ఒక్కరూ తమ విధులను చిత్తశుద్ధితో నిర్వహించి రోగులకు మెరుగైన సేవలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ చింతలపూడి నాగేశ్వరరావు, మేనేజర్ డి.మురళీధర్, ఎం.శ్రీనివాస్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అందమైన చేతిరాతతో ఉజ్వల భవిష్యత్



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే చక్కటి చేతిరాతను అలవర్చడం ద్వారా మానసిక ఎదుగుదలకు పునాదులు వేస్తున్నట్లు అని ప్రజ్ఞ పాఠశాల కరస్పాండెంట్ ఎన్. చక్రనాగ్ పేర్కొన్నారు. మంగళవారం నగరంపాలెంలోని ప్రజ్ఞ పాఠశాలలో లూసిడా హ్యాండ్ రైటింగ్ శిక్షకుడు రవికుమార్ నేతృత్వంలో చేతిరాతలో శిక్షణ పొందిన విద్యార్థులకు జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్.కోటేశ్వరరావు, ఇన్‌చార్జి షేక్ సిరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం పెంపు

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ ఎంటీ వరలక్ష్మి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు నవధ్యాన్యాలతో కూడిన పలు రకాల విత్తనాలు వేసవి దుక్కులలో వేసుకోవాలని చెప్పారు. తొలకరి జల్లులకు విత్తనాలు మొలకెత్తుతాయని ప్రధాన పంటవేసుకొనే 45రోజుల ముందు అవసరమైనంత వాడుకొని మిగిలిన దానిని పచ్చిరొట్ట ఎరువుగా దున్నించుకోవాలని తెలిపారు. దీనిద్వారా భూమి సారవంతమవుతుందన్నారు. అనంతరం రైతులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌డీపీ ఎ.మణి, ఐసీఆర్పీలు ఇర్ల వెంకటేశ్వర్లు, పెద్దారావు, తాటి శివనాగేశ్వరరావు, బి.రామారావు, పచ్చల ఐజాక్, పి.సీతారామరాజు, వీపీఏ ప్రశాంతి పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలి శాఖగ్రంథాలయాన్ని మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ తనిఖీ చేశారు. గ్రంథాలయానికి వచ్చే వారి వివరాలు తెలిపే రిజిస్టర్లు, పుస్తకాలు తీసుకెళ్లేవారి వివరాలు తెలిపే రిజిస్టర్లు పరిశీలించారు. పుస్తకాలు ఉండే స్థలాన్ని పరిశీలించారు. గ్రంథాలయ నిర్వహణలో పుస్తకాలు పాడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు సిబ్బందికి వివరించారు. గ్రంథాలయానికి ఎక్కువమంది వచ్చేలా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట గ్రంథాలయాధికారి సత్యశిరీష, సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ మోటార్లు చోరీ

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పంటపొలాల్లో మరోసారి దొంగలు హల్‌చల్ చేసి మోటార్లు చోరీ చేసిన ఘటనపై రైతులు మంగళవారం తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సేకరించిన వివరాల ప్రకారం పెనుమాక వైఎస్సార్ సెంటర్ వెనుక ఉన్న డొంక రోడ్డులో మేకా విశ్వనాథరెడ్డి, యడ్లపల్లి ప్రసాద్ పంట పొలాల్లో ఉన్న విద్యుత్ మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. ఉదయం పంట పొలానికి వెళ్లి పరిశీలించగా మోటార్ల వద్ద ఆటో వేసుకు వచ్చినట్లు గుర్తులు కనిపించాయి. దీంతో ఆటోలో వచ్చి దొంగతనం చేసినట్లు రైతులు నిర్ధాంచుకుని తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఒక్కో మోటార్ విలువ రూ.30 వేలు ఉంటుందని రైతులు తెలిపారు.

ఢిల్లీ ర్యాలీని జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ఢిల్లీలో నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు కోరారు. దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో మంగళవారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి గ్యాస్ పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెంచివేసిందని, ఎరువులు, విత్తనాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని అన్నారు. పంటకు కనీస మద్దతు ధర లేదని, కార్మిక చట్టాలను మార్చి కార్మికులను బానిసలుగా చేస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు పెట్టి రైతుల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గద్దె దించాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సాంబయ్య, టి.రామారావు పాల్గొన్నారు.

పార్క్‌లు, వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధికి చర్యలు

- కమిషనర్ కీర్తి చేకూరి
- పార్కులలో అభివృద్ధి పనుల పరిశీలన



గాంధీ పార్క్‌లో అభివృద్ధి పనులపై సిబ్బందితో చర్చిస్తున్న నగర కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: ప్రజలకు ఆహ్లాదాన్ని పంచి, పచ్చదనం ద్వారా ఆరోగ్యాన్ని అందించే పార్క్‌లు, వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధికి నగరపాలక సంస్థ ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసిందని నగర కమిషనర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు.గాంధీ పార్క్, చుట్టగుంట వాకింగ్ ట్రాక్, జంక్షన్ తదితర ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పార్క్‌లు, వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధిపై నగర పాలక సంస్థ స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక చేపట్టిందని పేర్కొన్నారు. నగరంలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో పార్క్‌లను అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. గాంధీ పార్క్ పనులు కూడా తుది దశకు చేరుకున్నాయని, త్వరలో ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. పనుల్లో ఎక్కడా జాప్యం లేకుండా చూడాలన్నారు. అనంతరం చుట్టగుంట చెరువు వాకింగ్ ట్రాక్ అభివృద్ధి పనులు పరిశీలించి, పనుల జాప్యంపై డీఈఈని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. చుట్టగుంట వాకింగ్ ట్రాక్, జంక్షన్‌లు నగరంలోకి వచ్చే ప్రధాన మార్గంలో ఉన్నందున గుంటూరు నగర ఖ్యాతిని ఇనుమడింపచేలా మోడల్‌గా ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం బుడంపాడులో అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న వెంచర్‌ను పరిశీలించి, కొలతలు తనిఖీ చేసి నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. ఓపెన్ స్పేస్, రోడ్ల వెడల్పు, ప్లాట్‌ల సైజ్ ప్రభుత్వ నిబంధనల మేరకు ఉండాలని చెప్పారు. పర్యటనలో ఎస్ఈ భాస్కర్, సిటీ ప్లానర్ మూర్తి, డెప్యూటీ ప్లానర్ కోటయ్య, ఈఈలు సుందరరామిరెడ్డి, కోటేశ్వరరావు, కార్పొరేటర్లు అడకా పద్మావతి, అచ్చాల వెంకటరెడ్డి, రోషన్, డీఈఈలు శ్రీనివాసరెడ్డి, కల్యాణ రావు, రమేష్ బాబు, ఏసీపీ అశోక్ కుమార్, ఏడీహెచ్ రామారావు పాల్గొన్నారు.

వలంటీర్ కుటుంబానికి ఆర్థిక సాయం



మహిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: రెండేళ్ల కిందట మృతి చెందిన వలంటీర్ కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సాయం చెక్కును ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా మంగళవారం అందజేశారు. మంగళదాస్ నగర్‌కు చెందిన వలంటీర్ కర్రి మహిత వలంటీర్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందింది. స్పందించిన ఎమ్మెల్యే ముస్తఫా విషయాన్ని ప్రభుత్వ అధికారులు, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ప్రభుత్వం రూ.5 లక్షలు ఆర్థిక సాయం మంజూరు చేసింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేద, బడుగు, బలహీన వర్గాలను ఆదుకునేందుకు సీఎం జగన్ అన్ని వేళలా ముందుంటారని చెప్పారు. వలంటీర్ మహిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం, తాము అన్ని వేళలా అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పఠాన్ రిహానా, వైఎస్సార్ సీపీ నేత నూరిఫాతిమా, వలంటీర్ తల్లిదండ్రులు భాస్కరరావు, లక్ష్మి, స్థానిక నాయకులు నూర్ ఖాన్, రత్నకిషోర్, సువర్ణలాల్, మేడిదబాబూరావు, కన్న, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

మేయర్ కావటి



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో కరెంట్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. నగరంలోని 20వ డివిజన్ కొబ్బరితోట ప్రాంతంలో 16 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఎలక్ట్రికల్, నగర పాలక సంస్థ ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, సర్వే అధికారులతో కలసి పర్యటించారు. అనంతరం సంపత్ నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 20వ పరిధిలోని పార్వతీపురం, బాబు రాజేంద్ర ప్రసాద్ కాలనీ, పీకలవాగు కట్ట, మేనక గాంధీ నగర్, అయ్యప్ప స్వామి గుడి ప్రాంతం, నల్లచెరువులోని కొన్ని ప్రాంతాలలో తరచుగా కరెంట్ సమస్యలు తలెత్తుతున్నాయని స్థానిక ప్రజల నుంచి చాలా కాలంగా ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. దీంతో ఎలక్ట్రిసిటీ అధికారులు, నగరపాలక సంస్థ అధికారులతో కొబ్బరితోట ప్రాంతంలోని ఖాళీ స్థలాన్ని పరిశీలించినట్లు పేర్కొన్నారు. కొబ్బరి తోట ప్రాంతంలోనే కాక నగరంలో కరెంట్ సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతాలలో ఎలక్ట్రికల్ అధికారులతో మాట్లాడి సబ్ స్టేషన్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గుంటూరు నగరంలో నూతన పాలక వర్గం ఏర్పడ్డాక నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, ముఖ్యంగా ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ప్రధాన రహదారుల విస్తరణ, రోడ్ల నిర్మాణం, సెంటర్ డివైడర్, హై మాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సదరు ప్రాంతంలో నిర్మించబోయే 16 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు అవసరమైన అనుమతులు వేగవంతం చేసి, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఈఈ శ్రీనివాస బాబు, నగర పాలక సంస్థ డీఈఈ హనీఫ్, ఏఈలు చంద్రశేఖర్, రాంబాబు, సర్వేయర్ హరికృష్ణ పాల్గొన్నారు.

ఫార్మసీ రంగానికి పెరుగుతున్న ప్రాధాన్యం

వీసీ ఆచార్య రాజశేఖర్



సదస్సులో సమర్పిస్తున్న పరిశోధనా పత్రాల సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ కరుణ తదితరులు

ఏఎన్‌యూ: ఫార్మసీ రంగానికి రోజురోజుకూ ప్రాధాన్యం పెరుగుతోందని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో 'కరెంట్ పారడైమ్స్ ఇన్ ఫార్మాసూటికల్ అనలిటికల్ టెక్నిక్స్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో అనలిటికల్ టెక్నిక్స్ ఉపయోగించడం వలన కొత్త రకాల మందులను కనుక్కోవడం త్వరితగతిన సాధ్యమవుతుందని చెప్పారు. దీని వలన మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఫార్మసీ రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకునే నైపుణ్యాలను విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. సమాజ హితమైన ఫార్మసీ రంగ అంశాలపై మరిన్ని పరిశోధనలు జరగాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ ఐఐసీటీ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.ప్రభాకర్ ప్రసంగిస్తూ గతంలో మందుల తయారీ కష్టతరంగా ఉండేదని నేడు అనలిటికల్ టెక్నిక్స్ కారణంగా ఎంతో సులభతరమయిందని వివరించారు. హైదరాబాద్ లక్సాయ్ లైఫ్ సైన్సెస్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీకాంత్ దిట్టకవి ప్రసంగిస్తూ బయోఎనలిటికల్ చాలెంజ్‌లో అనేక అంశాలు మనం క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుందని చెప్పారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ ప్రవల్లిక సదస్సు నిర్వహణ ఉద్దేశాన్ని వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.ప్రమీలారాణి, డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య సంధ్యాకోల్, గీతమ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శివకుమార్, నాట్కో ఫార్మసీ వైస్ ప్రెసిడెంట్ గ్నానదేవ్ ప్రసంగించారు. సదస్సులో సమర్పిస్తున్న పరిశోధనా పత్రాల సావనీర్‌ను వీసీ ఆవిష్కరించారు.

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) నగర పాలక సంస్థ అధికారులకు సూచించారు. అవసరమైతే కొత్త ట్యాంకర్లు కొనుగోలు చేసి నీటి సరఫరా చేయాలని అన్నారు. మంగళవారం మధ్యాహ్నం రెండు నుంచి రాత్రి ఏడు గంటల వరకు నగర పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. స్థానికులు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువచ్చిన తాగునీటి సమస్య, పారిశుద్ధ్యం, పందులు, కుక్కల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను సూచించారు. సాంకేతిక కారణాల వల్ల పెన్షన్ ఆగితే సమస్యను వెంటనే పరిష్కరించి జూన్ నాటికి వారికి పెన్షన్ అందేలా చూడాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. తొలుత రాజీవ్ గృహకల్ప కాలనీ వద్ద నిర్మాణం జరుగుతున్న చేనేత మగ్గం షెడ్లను పరిశీలించారు. ఈనెలాఖరుకు షెడ్ల నిర్మాణం పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలని అధికారులకు సూచించారు. అక్కడే నిర్మాణం జరుపుకుంటున్న పద్మశాలీయ, రజక కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలను పరిశీలించి కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం వెంటనే పూర్తి చేసి ఆయా సామాజికవర్గాలు శుభకార్యాలు జరుపుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. రత్నాలచెరువు, కొండపనేని టౌన్‌షిప్‌లలో జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. నగర పరిధిలోని ఆత్మకూరు గుంటూరు చానల్ వద్ద ఉన్న తాగునీటి పథకం ఆవరణలో నిర్మాణం జరుపుకుంటున్న తాగునీటి సంపు, స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్ నిర్మాణాలను పరిశీలించారు. నగరంలో కోట్ల రూపాయలతో జరుగుతున్న పనుల నాణ్యతలో రాజీపడకుండా వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా నగరంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. రత్నాల చెరువు, శ్రీ లక్ష్మీనృసింహ స్వామి కాలనీల్లోని వార్డు సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్, అడ్మిన్ నిరంతరం పర్యవేక్షించి ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి తాగునీరు సరఫరా అయ్యేలా చేస్తారన్నారు.

లేపాక్షి ఎంపోరియంలో డిస్కౌంట్ అమ్మకాలు

పాత గుంటూరు: బ్రాడీపేటలోని లేపాక్షి హస్తకళల ఎంపోరియంలో క్లియరెన్స్ సేల్ సందర్భంగా ఎంపిక చేసిన వస్తువులపై డిస్కౌంట్‌తో అమ్మకాలు చేస్తున్నట్లు మేనేజర్ ఎంవీఎస్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వస్తువులపై 10 శాతం నుంచి 50 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు రాయితీ ఉంటుందని, ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

16న సమస్యల పరిష్కారానికి విద్యుత్ అదాలత్

గుంటూరు ఈస్ట్: ఈనెల 16వ తేదీ విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చల్లా రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు –2 డివిజన్ విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో మేడికొండూరు మండలం డోగిపర్రు ఉపకేంద్రం ఆవరణలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని మేడికొండూరు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల్లోని విద్యుత్ వినియోగదారులు అదాలత్‌కు హాజరు కావాలని కోరారు. అదాలత్‌ను టీజీఈఆర్‌ఎఫ్ చైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్యానియేల్, సాంకేతిక సభ్యులు నిర్వహిస్తారన్నారు. విద్యుత్ వినియోగదారులు వారి సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలని కోరారు.

మైనార్టీ శాఖకు ఇంటిగ్రేటెడ్ హాస్టల్ కేటాయింపు

పట్నంబజారు: తూర్పు నియోజకవర్గంలోని బీఆర్ స్టేడియం ఎదురుగా నిరుపయోగంగా ఉన్న బీసీ సంక్షేమ శాఖ వసతి గృహ సముదాయాన్ని మైనార్టీ శాఖకు కేటాయిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదం తెలిపారని ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నో ఏళ్లుగా వసతి గృహం అసంపూర్తిగా నిర్మించి వదిలేయడంతో ఆ భవనాన్ని మైనార్టీ శాఖకు కేటాయించాలని సీఎం జగన్‌కు విన్నవించిన నేపథ్యంలో ఆమోదం తెలిపారన్నారు. ఆ భవనంలో ముస్లిం మైనార్టీలకు సంబంధించిన వసతులు కల్పిస్తామని తెలిపారు. ఈసందర్భంగా మతపెద్దలు కృతజ్ఞతలు తెలిపి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

జేఈఈ, నీట్, ఈఏపీ సెట్‌కు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ, నీట్, ఏపీ ఈఏపీ సెట్‌కు ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఉచిత శిక్షణనివ్వనున్నట్లు గణిత శాస్త్ర అధ్యాపకుడు పులుగు దీపక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది గుంటూరు, విజయవాడలలో ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఉచిత శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం గుంటూరుతో పాటు ప్రతి మండల, జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో డిజిటల్ తరగతులు, సెల్‌ఫోన్ ద్వారా ఆన్‌లైన్ తరగతులను ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల కోసం యూ-ట్యూబ్ చానల్, జూమ్ యాప్ ద్వారా సబ్జెక్టుల వారీగా శిక్షణ ఇస్తామని తెలిపారు. ఉచిత శిక్షణ కోసం 7780150751 నంబరు ఫోన్ చేసి నమోదు చేయించుకోవాలని సూచించారు.

ముగిసిన ఉచిత మెడికల్ క్యాంప్

తాడేపల్లిరూరల్: కోరమండల్ ఇంటర్నేషనల్ కంపెనీ ఆధ్వర్యంలో మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని కృష్ణా కెనాల్ గూడ్స్ షెడ్ వద్ద ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన కోరమండల్ లాజిస్టిక్ మేనేజర్ ప్రదీప్ మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. గూడ్స్ షెడ్ సిబ్బంది, హమాలీలు, లారీ ఓనర్స్, డ్రైవర్లకు వైద్యులు డాక్టర్ పి.విజయభాస్కర్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో అవేజ్ లిమిటెడ్ విజయవాడ మేనేజర్ ఎల్. స్వరూప్ పాల్గొన్నారు.

పొలంలో పంటల అవశేషాలు తగలబెట్టొద్దు



తెనాలి: రబీ పంటలు చేతికొచ్చాక, చేలల్లో పంట అవశేషాలను రైతులు తగులబెట్టొద్దని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు రాజకుమారి అన్నారు. పంట అవశేషాలను చేలో ఆచ్ఛాదనగా వాడాలని, పంట కోతల అనంతరం భూమిని ఖాళీగా వదిలేయకుండా 30 రకాల విత్తనాలను చల్లుకోవాలని సూచించారు. కొల్లిపరలోని రైతుభరోసా కేంద్రం-2లో మంగళవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి పొలం బడి, సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజకుమారి మాట్లాడుతూ.. ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ విధానంలో 30 రకాల విత్తనాలను చల్లుకోవటం వల్ల పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. ఫలితంగా అదనపు ఆదాయం లభిస్తుందని, భూమిలో జీవవైవిధ్యం పెరిగి, సూక్ష్మజీవులు, వానపాములు వృద్ధి చెందుతాయని తెలిపారు. దీనివల్ల రసాయన అవశేషాలు లేని ఆహార పదార్థాలను రైతులు సొంతానికి వాడుకుంటూ సమాజానికి అందించే అవకాశం ఉంటుందని వివరించారు. తెనాలి యాంకర్ సతీష్, డివిజన్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు..

- ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్
- నల్లచెరువు వీధిలో గడప గడపకు మన ప్రభుత్వం



స్థానికులకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే గిరిధర్

నగరంపాలెం: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. 66వ సచివాలయ పరిధిలోని నల్లచెరువు 25 వీధి ప్రధాన రహదారి వద్ద మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ఎవరెవరికి ఏ స్థాయిలో అందిస్తున్నారనే అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ నగరాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ పూర్తిగా సహకరిస్తున్నారని అన్నారు. ప్రతి వీధిలోనూ సిమెంట్ రహదారులను నిర్మిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ కావటి మనోహర్‌నాయుడు, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, 20వ డివిజన్ అధ్యక్షుడు షేక్ ఖాజామోహిద్దీన్, నాయకులు టెంట్‌హౌస్ బాబు, కంతేటి శ్యామ్, నాగూర్, జుబేర్, సునీల్, కవిత, షకీలా, ఫాతిముస్, రవి, కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు చదువులు చెప్పించే బాధ్యతతో పాటు ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు గుంటూరు ఎంఈఓ అబ్దుల్ ఖుద్దూస్ పేర్కొన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా రైలుపేటలోని గొలుసు నాంచారమ్మ– కొండలరావు నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంఈవో ఖుద్దూస్ మాట్లాడుతూ పిల్లల్లో అనారోగ్యానికి కారణమయ్యే నులి పురుగుల నివారణకు ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు వయసు గల పిల్లలు ప్రతి ఒక్కరూ ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని అన్నారు. వైద్యారోగ్య శాఖ ద్వారా జిల్లా వ్యాప్తంగా ప్రతి పాఠశాల, కళాశాల విద్యార్థులకు పంపిణీకి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. కడుపులో నులి పురుగులు వృద్ధి చెందితే పిల్లలు అనారోగ్యానికి గురవుతారని, ఆహారం, మురుగు చేతుల ద్వారా లార్వా చర్మం లోపలికి చొచ్చుకుపోవడం వలన వీటి సంక్రమణకు గురవుతారని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను తప్పక పాటించాలన్నారు. నులి పురుగులు ఉన్న పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, బలహీనత, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం లాంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నులి పురుగుల నివారణ మాత్రలతో ఎంతో ఉపయోగం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ కీర్తి, డాక్టర్ పుష్ప, డాక్టర్ భాను ప్రకాష్, ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, స్కూల్ చైర్మన్ జాఫర్, సీఆర్పీ సరళ కుమారి పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞ చూపిన విద్యార్థులు



విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ, లలిత తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: వివిధ కళాశాలలు, యూనివర్సిటీలు నిర్వహించిన పోటీల్లో హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థులు బహుముఖ ప్రజ్ఞావంతులుగా నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ తెలిపారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విజ్ఞాన్ వర్సిటీలో ఇటీవల నిర్వహించిన ఉద్భవ్ పోటీల్లో టీం బిల్డింగ్ అంశంలో తరుణ్, సాయి, షేక్ షారూఖ్ ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. అదే విధంగా కళ్లం హరనాథరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌లో భాగంగా బిజినెస్ క్విజ్‌లో సీత కిరణ్మయి, నిఖిత, వెంకట కాత్యాయని, ద్వితీయ స్థానం, మార్కెట్ మేకర్స్‌లో వెంకట కల్యాణ్, వెంకట కాత్యాయని, హిమ నిఖిత తృతీయ స్థానంలో నిలిచినట్లు వివరించారు. ఏఎన్‌యూ నిర్వహించిన జాతీయస్థాయి సదస్సులో హిమ నిఖిత, అమృతవల్లి, దీపికా పరిశోధన పత్రాలు సమర్పించారని తెలిపారు. విజ్ఞాన్ నిరులలో నిర్వహించిన నిరుల యంగ్ మేనేజర్‌తో పాటు బిజినెస్ క్విజ్‌లో పి.అమృతవల్లి విజేతగా నిలిచిందని వివరించారు. అదే విధంగా వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన తమ విద్యార్థులు ఆల్ రౌండర్లుగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, వి.చక్రవర్తి, సహాయ ఆచార్యులు కల్యాణి, వైష్ణవి, అభిలాష్ పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యతో ఉన్నత శిఖరాలు

బీఈఎంఎల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్ ప్రొడక్షన్ డైరెక్టర్ శివమకుటం



మాట్లాడుతున్న బిఈఎంఎల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్ ప్రొడక్షన్ డైరెక్టర్ శివమకుటం

మోతడక(తాడికొండ): ఉత్తమ విలువలతో కూడిన విద్యనభ్యశించడం ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రులకు, చదువుకున్న విద్యాసంస్థకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్, బీఈఎంఎల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్ ప్రొడక్షన్స్ ఇండిపెండెంట్ డైరెక్టర్ శివమకుటం అన్నారు. తాడికొండ మండలం మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్నోవేషనల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు వెళ్లినపుడు విద్యార్థులకు అవసరమైన పలు నైపుణ్యాలను ఆయన వివరించారు. ఇందులో భాగంగా ఇంటర్వ్యూ టిప్స్, గ్రూప్ డిస్కషన్స్, రెస్యూమ్ ప్రిపేరింగ్, వ్యవస్థాపక, ఇన్నోవేషన్ వంటి పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రంగారావు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇలాంటి వర్క్‌షాప్‌లు ఉపయోగకరంగా ఉంటాయని నిపుణులతో శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. అవకాశాలను అందిపుచ్చుకొని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ పి.బాలమురళీకృష్ణ, ఈసీఈ విభాగాధిపతి డి.నాగరవికిరణ్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ క్రెడిట్ కార్డుతో రుణ సదుపాయం

ఫిరంగిపురం: పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డుతో తక్కువ వడ్డీతో కూడిన రుణం లభిస్తుందని పశుసంవర్థకశాఖ ఏడీఏ ఆలపాటి మురళీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని పశువైద్యశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. పేషెంట్ రిజిస్టర్, ఏఐ రిజిస్టర్, మొబైల్ వాహనం ఓపీ రిజిస్టర్ పరిశీలించారు. అనంతరం ఇప్పటివరకు కేసీసీ (కిసాన్ క్రెడిట్ కార్డుల) కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పశువైద్యశాల పరిధిలోని హౌస్ గణేష్, వేములూరిపాడు, అమీనాబాద్, 113 తాళ్లూరు, శిరంగిపాలెం, తక్కెళ్లపాడుతోపాటు ఫిరంగిపురానికి చెందిన పాడిరైతుల నుంచి వంద వరకు కార్డుల కోసం దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. వాటిని పరిశీలించిన తర్వాత జిల్లా డీఏహెచ్‌వో అధికారికి అందజేయనున్నట్లు తెలిపారు. వాటిని పరిశీలించి అర్హులైన వారిని గుర్తించి లీడ్ బ్యాంకు మేనేజర్‌కు అందజేస్తారని వారి వద్ద నుంచి సంబంధిత బ్యాంకులకు అనుమతితో కూడిన పత్రాలు వస్తాయని చెప్పారు. దీని ద్వారా అతి తక్కువ వడ్డీతో కూడిన రుణం అందజేస్తారన్నారు. పాడిగేదెల దాణా, షెడ్లు వేసేందుకు, గడ్డి, గడ్డి విత్తనాల కొనుగోలుకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. అనంతరం వైద్యశాలకు వచ్చిన ఐస్‌లైన్ రిఫ్రిజిరేటర్, బాటిల్ కూలర్లను పరిశీలించారు. వ్యాక్సిన్ పాడవకుండా ఉండేందుకు ఇవి ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ఆయన వెంట పశువైద్యాధికారి కోటిరత్నం ఉన్నారు.